క్లుప్తంగా

ఆర్‌బీఐ నిబంధనలు పట్టవా..!

• రూ.10 నాణేలు తీసుకోని వ్యాపారులు

పొదలకూరు: రూ.10 నాణేలను వ్యాపారులు తీసుకోవాల్సిందిగా ఆర్‌బీఐ ప్రకటించినా చాలామంది వ్యాపారులు విముఖత ప్రదర్శిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యాపారులు నాణేలను తీసుకుంటున్నా ఇక్కడ మాత్రం ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో వినియోగదారులు, వ్యాపారుల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సందర్భాలున్నాయి. పలువురు మాత్రం నిబంధనలు పాటించి నాణేలు తీసుకుంటున్నారు. పొదలకూరు పట్టణంలో ఓ మెడికల్స్ యజమాని తాను రూ.10 నాణేలను తీసుకుంటానని బోర్డు కూడా పెట్టాడు. రూ.10, రూ.20 నాణేలను తిరస్కరిస్తే చట్టరీత్యా నేరమని ఆర్‌బీఐ ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో కొంత మార్పు వచ్చినా గ్రామాల్లో రూ.10 నాణేలు చెల్లవని చిరు వ్యాపారులు చెబుతూ తిరస్కరిస్తున్నారు.

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

కోవూరు: మండలంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ 'లైనెక్స్' ఆపరేటింగ్ సిస్టమ్‌లో వివిధ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ పొందినట్లు తెలియజేశారు. సమన్వయకర్తలుగా ఎంఎస్ఎన్.శివనాగమణి, కె.బాలకృష్ణ వ్యవహరించారు.

నిషేధాజ్ఞలు సరే.. పట్టించుకునే దిక్కేది?

చిట్టమూరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినా, అది వాయుగుండంగా మారినా, తుఫాన్‌గా చెలరేగినా ముందుగా ప్రభావం చూపించేది తీర ప్రాంత గ్రామాలపైనే.. వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వచ్చిన వెంటనే అధికార యంత్రాంగమంతా ముందుగా చేసే పని మత్స్యకారులకు వేటకు వెళ్లొద్దని నిషేధాజ్ఞలు జారీ చేయడమే. జిల్లాలో కావలి నుంచి తడ వరకూ విస్తరించి ఉన్న తీరప్రాంత గ్రామాల్లో చేపల వేటే జీవనాధారం. ఇక్కడి మత్స్యకారులకు ఒక్క రోజు వేట నిలిచినా పూట గడవడం కష్టమే. వేటకు వెళ్తే వచ్చే సంపాదనే ఆరోజు ఖర్చులతోపాటు మత్స్యకారులను పీల్చిపిప్పి చేస్తున్న రోజువారీ వడ్డీ వ్యాపారులకు (తండల్) వాయిదాలు చెల్లించేందుకు ఆధారమవుతుంది. వేటకు వెళ్లలేని వృద్ధులు కూడా వేట సమయంలో వచ్చే చేపలను గ్రేడింగ్ చేయడం, ఆరబెట్టడం, మారుబేరాలకు అమ్ముకోవడం వంటి పనుల ద్వారా రోజులు గడుపుకొనేవారు. ఈక్రమంలో తుఫాన్లు, వాయిగుండాల సమయంలో ఐదారు రోజులపాటు వేట నిలిచిపోవడంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తుండటం, మరోవైపు వేట, వేట ఆధారిత పనులు నిలిచిపోవడంతో పూట గడుపుకొనేందుకు వృద్ధులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. గతంలో తుఫాన్లు, అల్పపీడనాల సమయంలో ప్రభుత్వమే బియ్యం, నిత్యావసర వస్తువులు, అత్యవసర మందులు ఉచితంగా అందించేంది. ప్రస్తుతం మత్స్యకార గ్రామాల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామాలు ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోతే తప్ప పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ దఫా మత్స్యకార భరోసాకు మంగళం పాడటంతో గంగపుత్రులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో గతనెల నుంచి తరచూ వేటకు అంతరాయం ఏర్పడుతోంది.

ఒకటే వాన

• సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో వర్షాలు
• జలమయమైన రహదారులు
• వాహనదారుల ఇబ్బందులు
• కడలి కల్లోలం



పొదలకూరులో..

పొదలకూరు: సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పొదలకూరు మండలంలో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురిసింది. శనివారం కూడా వాన కొనసాగింది. పట్టణంలో రహదారులు జలమయమయ్యాయి. విడతల వారీగా కుండపోత వర్షం నమోదైంది. వాగులు, వంకలు పొంగడంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. మండలంలో మొత్తం 52 చెరువులున్నాయి. వర్షాలతో ఇప్పటి వరకు 50 శాతానికి పైబడి నీరు చేరినట్టు రైతులు వెల్లడించారు. వరినార్లు పోసుకోవడంతోపాటు నాట్లు చేపట్టారు. వర్షం కారణంగా నాట్లు వాయిదా వేసుకోగా నార్లు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండో పర్యాయం నార్లు పోసుకున్న వారు మళ్లీ నారుమడులు దెబ్బతింటే తిరిగి పోసుకునేందుకు సమయం సరిపోదని వాపోతున్నారు.

ఆశాజనకంగా వర్షపాతం

ఈ ఏడాది మండలంలో ఆశాజనకంగా వర్షపాతం నమోదైంది. సాధారణం 1064.6 మి.మీ కాగా ఇప్పటి వరకు 994.8 మి.మీ నమోదైనట్టు ఏఓ ఎ.వాసు వెల్లడించారు. వర్షపాతం వివరాలను వ్యవసాయాధికారులు శనివారం వెల్లడించారు. జూన్ నుంచి సాధారణ వర్షపాతం 887.8 మి.మీ కాగా ఇప్పటి వరకు 994.8 మి.మీ వర్షం కురిసింది. అయితే జూన్ నుంచి అక్టోబర్ వరకు సకాలంలో వానలు పడలేదు. నవంబర్‌లో 318 మి.మీ కురవాల్సి ఉండగా 240.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ నెల 13వ తేదీన 122.2 మి.మీ వాన ఒకేరోజు పడింది. జూన్ నుంచి ఇప్పటి వరకు 48 రోజులు మాత్రమే వర్షాలు కురిశాయి. ఈనెలలో కూడా వర్షాలు కురిసే పరిస్థితి ఉండడంతో సాధారణ వర్షపాతాన్ని అధిగమించేందుకు అవకాశం ఉన్నట్టు ఏఓ వెల్లడించారు.



ముత్తుకూరు: కృష్ణపట్నం వద్ద ఎగసిపడుతున్న అలలు

ఎగసిపడుతున్న అలలు

ముత్తుకూరు: మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 34.8 మి.మీ, శనివారం 28.6 మి.మీ వర్షపాతం నమోదైంది. సముద్రం అల్లకల్లోలంగా మారింది. పట్టపగలే చీకట్లు అలముకున్నాయి. కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి.

అప్రమత్తంగా ఉండాలి

మనుబోలు: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ శాఖలను అప్రమత్తం చేశామని తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలు వారి ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసమైతే 99895 02066 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కోవూరులో..

కోవూరు: మండల పరిధిలో శనివారం ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెంలో ముసురు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి దఫదఫాలుగా కురుస్తున్న వర్షంతోపాటు ముసురు ఆవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా చలిగాలులు అధికమయ్యాయి. చిన్నపాటి వర్షానికే



ఇందుకూరుపేట : మైపాడు తీరం



ముత్తుకూరులో..

బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో రోడ్లు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు సరిగ్గా లేక నీరు ఎక్కడికక్కడే నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

అలల ఉధృతి

ఇందుకూరుపేట: తుఫాన్ కారణంగా మండలంలోని మైపాడు తీరంలో అలల ఉధృతి కొనసాగుతోంది. కడలి కల్లోలంగా ఉండడంతో పాటు తీరం వెంబడి తీవ్రమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. కాగా ఎడతెరపిలేని వానలతో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నాణ్యత లేక.. నెలకే ఇలా..



నార్తురాజుపాళెం వైఎస్సార్ కూడలిలో గుంతల రోడ్డుపై వాహనదారుల అవస్థలు

• మొక్కుబడిగా మట్టేసి మెక్కేసిన నాయకులు
• పట్టించుకోని అధికారులు

కొడవలూరు: గుంతల రహిత రోడ్లుగా మారుస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఆ విధంగానే నియోజకవర్గంలోని పలు రోడ్లకు కంటితుడుపు చర్యగా కంకర పొడి తోలి సరిపుచ్చారు. అయితే నాలుగు చినుకులకే కంకర పొడంతా కొట్టుకుపోయి గుంతలు యథావిధంగా మారాయి. మండలంలో ఎంతో ప్రాధాన్యమున్న నార్తురాజుపాళెం, కొడవలూరు రైల్వేగేటు రోడ్డు, అల్లూరు రోడ్డులపై ఉన్న గుంతలను కంకర పొడితో నింపి పట్టుమని నెల రోజులు కూడా గడవలేదు. అంతలోనే పూడ్చిన గుంతలు మళ్లీ పుట్టుకొచ్చాయి. ఈ గుంతలు బాగా పెద్దవిగా ఉండడంతో వర్షపు నీరు నిండిపోయి ఉన్నాయి. వాహనదారులకు వీటి తీవ్రత తెలియక లోతైన గుంతల్లో అదుపుతప్పి పడిపోతున్నారు. ప్రధాన రోడ్లపై గుంతలు ఇదేవిధంగా మారాయి. వీటిని కంకర, తారు లేక సిమెంట్‌తో పూడ్చి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదు. మొక్కుబడిగా కంకర పొడి తోలి చేతులు దులుపుకోవడంతో ఇలాంటి పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. పట్టుమని పది రోజులు కూడా ఉండకుండాపోలేలా గుంతలను పూడ్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వెంకటాచలం: పూజా కార్యక్రమాల్లో ఎస్పీ దంపతులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆకాశ దీపం వెలిగించారు.

వెంకయ్య స్వామికి..

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు చెర్లోపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, సునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శివాలయంలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు సమీపంలో ఉన్న అడవిలో శివాలయాన్ని ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు శనివారం సందర్శించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవారు

ఇందుకూరుపేట: కార్తీక మాసం చివరిరోజు తీర ప్రాంత గ్రామమైన మైపాడులో అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను వివిధ పుష్పాలతో అలంకరించి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. మైపాడుతోపాటు పరిసర ప్రాంతాలైన నరసాపురం, రావూరు, కొరుటూరు, సోమరాజుపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, గో పూజలు జరిగాయి. మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం

ఆలయంలో కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి దువ్వూరు కల్యాణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఆలయ ఈఓ తాతా శ్రీనివాసులు పాల్గొన్నారు.

108లో ఈఎంటీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 108 వాహనాల్లో ఖాళీగా ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని ఆ వాహనాల జిల్లా మేనేజర్ బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) ఆవరణలో దిశ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న 108 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 83284 61648, 96420 27098 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

3న యండమూరితో ముఖాముఖి

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలో ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు వినోద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ ఫౌండర్ మనపాటి చక్రవర్తి శనివారం తెలిపారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

దాతల సాయం అభినందనీయం

• డీఈఓ డాక్టర్ బాలాజీరావు

ఇందుకూరుపేట: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని డీఈఓ డాక్టర్ ఆర్.బాలాజీరావు అన్నారు. షెల్ ఆయిల్ సహకారంతో స్మైల్ ఫౌండేషన్ మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను డీఈఓ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.2 లక్షల విలువైన ల్యాబ్ సామగ్రిని ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. స్మైల్ ఫౌండేషన్ స్టేట్ కో–ఆర్డినేటర్ విజయసారథి మాట్లాడుతూ షెల్ ఆయిల్ సహకారంతో పది పాఠశాలల్లో పది సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తమ సేవలను మరింత విస్తరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓలు ఎస్.వెంకటేశ్వరనాయక్, సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ

చిరుతిళ్లు.. ఆరోగ్యానికి తూట్లు

• దుకాణాల్లో నాణ్యత లేని స్నాక్స్
• పొంచి ఉన్న ముప్పు
• చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్న ప్యాకెట్ ఫుడ్

కోవూరు: స్నాక్స్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్నా.. పెద్దా.. అనే తేడా లేకుండా అందరూ ఇష్టంగా తింటారు. అయితే దీనినే కొందరు వ్యాపారంగా మార్చుకుని ప్రముఖ కంపెనీలను పోలి ఉండేలా ఒకట్రెండు అక్షరాల తేడాతో రూపొందించే నాసిరక ఉత్పత్తులను చిన్నచిన్న దుకాణాలకు విక్రయించేస్తున్నారు. నకిలీ వాటిపై తయారీ ప్రాంత చిరునామాతో పాటు ఎంఎఫ్‌పీ కూడా ఉండదు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నా, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చిన్న దుకాణాలే లక్ష్యంగా..

నియోజకవర్గంలోని కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో దాదాపు వెయ్యికి పైగా దుకాణాలున్నట్లు అంచనా. అందులో అత్యధికం చిన్న దుకాణాలే కావడంతో నాణ్యతలేని స్నాక్స్ విక్రయాలు సులభంగా మారింది. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో లభించే చిరుతిళ్లలో అధిక మోతాదులో ఉప్పు, కారంతోపాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



దుకాణంలోని ప్యాకెట్లు

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం



నాసిరకం చిరుతిళ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు వినియోగిస్తున్నారు. వీటికి దూరంగా ఉండడం మంచిది.

– డాక్టర్ వెంకట చలపతిగౌడ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, కోవూరు

దూరంగా ఉండాలి



జంక్ ఫుడ్‌కు పిల్లలకు దూరంగా ఉంచాలి. వీటివల్ల పిల్లలకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. జీర్ణకోశ సమస్యలు, కడుపు నొప్పి లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

– సలావుద్దీన్, వైద్యుడు, కోవూరు ప్రభుత్వాస్పత్రి

అవగాహన కల్పించాలి



పిల్లలు మారం చేయడం వల్ల తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా మార్కెట్‌లో దొరికే చిరుతిళ్లను కొనిస్తున్నారు. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సి ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దాసరి వినోద్‌కుమార్

నిమ్మకు తగ్గిన డిమాండ్



రాలిపోయిన కాయలు



నిమ్మ తోటలు

• భారీ వర్షాలే కారణం
• దిగజారుతున్న ధరలు
• తోటల్లోకి వెళ్లే పరిస్థితి లేదు

పొదలకూరు: భారీ వర్షాలు నిమ్మ ధరలపై ప్రభావం చూపుతున్నాయి. మండలంలో 5 వేల ఎకరాల్లో తోటలున్నాయి. ప్రస్తుతం నిమ్మ మార్కెట్ యార్డులో కిలో రూ.20 నుంచి రూ.30, లూజు (బస్తా) రూ.1,600 నుంచి రూ.2,400 వరకు ధరలున్నాయి. అయితే ఇవి మరింతగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉటుందని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాల కారణంగా రైతులు తోటల్లోకి వెళ్లలేక కాయలు రాలిపోతున్నాయి. ఉత్తర భారతదేశంలో చలితీవ్రత పెరగడం, అన్ని ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి జరుగుతుండడంతో రైతులకు ఈనెలలో కష్టకాలం ఏర్పడే అవకాశం ఉంది. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం కాయలకు డిమాండ్ లేదని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న ధరలు తక్కువ కాకున్నా తుఫాన్ల వల్ల కురుస్తున్న వర్షాలకు తోటలు చిత్తడిగా మారుతూ వారం, పదిరోజులపాటు కాయలు కోసే పరిస్థితులు లేకుండా పోతున్నాయి.

పెరిగిన దిగుబడి

ఇటీవల తోటల్లో కాయల దిగుబడి పెరిగింది. దీంతో మార్కెట్‌కు విపరీతంగా రావడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. వారంరోజుల క్రితం కిలో రూ.25 నుంచి రూ.40 వరకు ఉంది. నేడు ధరలు తగ్గుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. నిమ్మకాయల వాడకం తగ్గడం.. దిగుబడి పెరగడంతో మార్కెటింగ్ చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నట్టు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. అయితే ప్రస్తుతం వర్షాలతో చిత్తడిగా మారిన తోటల్లో కూలీలను ఏర్పాటు చేసి కాయలు కోయించే పరిస్థితి లేదంటున్నారు. నీరు చేరితే తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

తోటల్లోకి వెళ్లలేకున్నాం



నిమ్మ తోటల్లోకి వెళ్లేకపోతున్నాం. భారీ వర్షాలకు తోటల్లో నీరు చేరి తొలగించేందుకు సైతం వీలు లేకుండా ఉంది. తోటలు చిత్తడిగా ఉండడంతో కాయలు కోయలేకపోతున్నాం. కాయలు రాలిపోతున్నాయి.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

కాయల దిగుబడి పెరిగింది



కాయల దిగుబడి పెరిగి మార్కెట్‌కు బాగా వస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి తోటల్లో నీరు చేరడంతో మరో వారం రోజులు రైతులు తోటల్లోకి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు